క్లుప్తంగా

నేడు మంగళపల్లెలో గడప గడపకు..

బంగారుపాళెం: మండలంలోని జిల్లేడుపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని మంగళపల్లె పంచాయతీలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



యాదమరి: మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయం ముందు స్థానిక సర్పంచ్ ఝాన్సీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ సురేష్ బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు, రైతుల దాహం తీర్చేందుకు స్థానిక సర్పంచ్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్ రెడ్డి, బాలాజీ, పయని, కార్యదర్శి అంజుమ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర పరిధిలోని నరిగపల్లె, గంగసాగరం ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పౌష్టికాహార ప్రాముఖ్యతపై ఆరోగ్య విద్యాధికారి రాజేంద్ర ప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనత సమస్యను అధిగమించడానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉదయకుమార్, త్రివేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్‌ఆర్‌పేటకు ఉత్తమ పంచాయతీ అవార్డు



ప్రశంసా పత్రం అందుకుంటున్న బీఎన్‌ఆర్‌పేట సర్పంచ్

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేట పంచాయతీకి చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు వరించింది. అలాగే మండలంలో కూడా నీటి సదుపాయాల కల్పనలో ఉత్తమ పంచాయతీగా గుర్తించి ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ సత్కారాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ చేతుల మీదుగా సర్పంచ్ త్యాగరాజులు అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ జయరాం, నాయకులు సంపత్, ప్రతిమారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న అజయ్‌కుమార్‌రెడ్డి

సదుం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సోమవారం స్థానిక జెడ్పీహైస్కూల్‌లో సోషియల్ ఆడిట్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన వివరాలను యాప్‌లో నమోదు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ శ్రీరాములు, రిసోర్స్‌పర్సన్ బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగంపై సదస్సు

పుంగనూరు: పట్టణంలోని జేఎండీ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీఈ రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ విజయన్ హాజరయ్యే ఈ సదస్సులో రైతులు పాల్గొనాలని కోరారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శశికళ

పుంగనూరు: రైతులు తప్పనిసరిగా తమ పొలాలకు భూసార పరీక్షలు చేయించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శశికళ తెలిపారు. సోమవారం మండలంలోని చదళ్ల గ్రామంలో వాటర్‌షెడ్ కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు, నీటి సంరక్షణ, సమగ్ర పోషకాల వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. శాస్త్రవేత్తలు చందన, ప్రభాకర్‌రెడ్డి, రైతులు బాలచంద్రారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్‌శాఖతోనే పల్లెప్రగతి





బంగారుపాళెం: ఉత్తమ సర్పంచులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రశంసాపత్రాలను అందజేస్తున్న నాయకులు



తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో..



గొల్లపల్లె పంచాయతీ సర్పంచ్‌కు సన్మానం



గుడిపాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్ర

బంగారుపాళెం: పల్లెసీమల ప్రగతిలో పంచాయతీ రాజ్ శాఖదే కీలకపాత్ర అని వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు కనీస అవసరాల కల్పనకు అన్ని శాఖల కంటే పంచాయతీరాజ్‌శాఖ కీలకమన్నారు. సింగిల్‌విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు దత్తాత్రేయరెడ్డి, నారే సోమశేఖర్ మాట్లాడారు. అనంతరం ఉత్తమ సర్పంచులుగా ఎంపికైన వెలుతురుచేను, తగ్గువారిపల్లె, జిల్లేడుపల్లె సర్పంచులు సుబ్రమణ్యం, వాణీప్రియ, భారతమ్మ, బంగారుపాళెం-2 ఎంపీటీసీ ఉషను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించి, ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ హేమచంద్రారెడ్డి, పలువురు సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఎంపీడీఓ గౌరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో మండలంలోని తలపులేనివారి పంచాయతీలో పేటమిట్ట గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎన్నికైందని తెలియజేశారు. అనంతరం మండలంలో నీటి కొరత లేని గ్రామాలుగా ఆకనంబట్టు, వేనూతనపల్లి పంచాయతీలకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీకృష్ణ, రాజారత్నంరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: గ్రామ పంచాయతీ వ్యవస్థ ఎంతో పటిష్ఠమైనదని ఎంపీడీఓ నిర్మలాదేవి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అవసరాలను తీర్చడానికి, పేదరిక నిర్మూలనకు కృషి చేసేందుకే జాతీయ పంచాయతీరాజ్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎంపీపీ మోహన్, ఎంపీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన ఎగువ తవణంపల్లె పంచాయతీ సర్పంచ్ చిట్టెమ్మ, కె.పట్నం పంచాయతీ సర్పంచ్ వై.పుష్పలత, మాధవరం పంచాయతీ సర్పంచ్ సీతమ్మలకు మెమెంటో, సేవాపత్రాలు అందజేసి దుశ్శాలువలతో సత్కరించారు. అంతకుముందు అధికారులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ రెడ్డిబాబు, మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యాదమరిలో

యాదమరి: సర్పంచ్‌లు తమ పంచాయతీల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేయడం చాలా సంతోషకరమని ఎంపీపీ సురేష్ బాబు తెలిపారు. అనంతరం సర్పంచ్‌లను ఎంపీడీఓ శివరాజ్, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, కార్యదర్శులు శాలువలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

గుడిపాలలో..

గుడిపాల: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేస్తేనే అభివృద్ధి వీలవుతుందని ఎంపీడీఓ ఉపేంద్ర అన్నారు. మండల పరిషత్ కార్యాలయలంలో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవం నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈలు జయచంద్రారెడ్డి, హిమంత్, ఎంపీటీసీలు క్రిష్టారెడ్డి, శామ్‌వేల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' వినతులు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ అరుణ



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిరణ్



తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో.

చిత్తూరు అర్బన్: ‘స్పందన’ కార్యక్రమంలో అందే ఫిర్యాదులు, వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ జె అరుణ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ‘స్పందన’లో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయా వినతులు, సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి, నిర్ణీత సమయంలో పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇంజినీరింగ్ : 2, టౌన్ ప్లానింగ్ : 2, ప్రజారోగ్య విభాగం : 2, రెవెన్యూ సెక్షన్ 1 చొప్పున వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: స్పందనలో అందే అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కిరణ్ వీఆర్వోలను ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. దారి సమస్యలు, భూ సమస్యలు, ఇళ్ల పట్టాలు తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 21 అర్జీలు అందాయి.

తవణంపల్లెలో..

తవణంపల్లె: భూసమస్యలపై స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తహసీల్దార్ సుశీల తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలువురు రైతులు భూసమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. అదే విధంగా ఆదివారం రాత్రి వీచిన గాలులకు మారేడుపల్లెకు చెందిన మాధవనాయుడు కోళ్లఫారంపై కొబ్బరిచెట్టు విరిగిపడి పూర్తిగా ధ్వంసమైందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్థికసాయం కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

కుమ్మరపల్లెలో ఘర్షణపై ఆరా



కుమ్మరపల్లె గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ వెంకటేశ్వర్లు

ఐరాల: మండలంలోని కుమ్మరపల్లెలో ఆదివారం రాత్రి గురప్ప ఆచారి కొడుకు దారి విషయమై కత్తితో నలుగురిపై దాడి చేసిన విషయం తెలిసిందే. సోమవారం సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘర్షణకు గల కారణాలను కుమ్మరపల్లెలో స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. ముగ్గురు నిందితులను అదుపులో తీసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలను మీడియా సమావేశంలో వెల్లడించే అవకాశం ఉంది.

ట్రాన్స్‌కోకో నష్టం రూ.5లక్షలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్లలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. రెండు డివిజన్లలో మొత్తం 40 విద్యుత్ స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గాలీవాన కారణంగా రూ.5 లక్షల వరకు తమశాఖకు నష్టం వాటిల్లిందని ఈఈలు హరి, పద్మనాభపిళ్లై తెలియజేశారు. వెంటనే క్షేత్రస్థాయిలో సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు చెప్పారు.

నేటి నుంచి కోదండరాముని ఉత్సవాలు

గంగవరం: మండలంలోని గుండుగల్లులో వెలసిన శ్రీకోదండరామభద్రస్వామి ఉత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పదిరోజులపాటు ఉత్సవాలు జరిపించనున్నట్లు వెల్లడించారు. స్వామివారికి వివిధ వాహన సేవలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల వేలం రేపు

గంగవరం: వివిధ కేసుల్లో సీజ్ చేసిన 4 బైక్‌లు, ఒక కారును బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనేవారు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి ముంగిటకే వైద్యం



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్



ఎగువమారేడుపల్లెలో పర్యటిస్తున్న వైద్యులు



గుడిపాల: శ్రీరంగంపల్లెలో..

ఐరాల: ప్రజల ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రభుత్వ వైద్యసేవలు అందిస్తున్నట్లు కాణిపాకం వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని మద్దిపట్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 65 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు తగు చికిత్సలు అందించాలని సిబ్బందికి సూచించారు. వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ శివయ్య, ఎంపీహెచ్ఎస్ నాగరత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, ఏఎన్ఎం మాధవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని ఎగువ మారేడుపల్లెలో డాక్టర్ ప్రియాంక, ఎ.గొల్లపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 135 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా గర్భిణులు, చిన్న పిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ వాహనంలో పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్రీరంగంపల్లెలో..

గుడిపాల: మండలంలోని శ్రీరంగంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని 104 డాక్టర్ ప్రశాంతి నిర్వహించారు. షుగర్, బీపీ, గర్భవతులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అన్నపూర్ణ, ఆశావర్కర్ శివగామి, సిబ్బంది పాల్గొన్నారు.

వెటర్నరీ కళాశాలకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

సదుం: ఎర్రాతివారిపల్లె మార్గంలోని జగనన్న లేఅవుట్ సమీపంలో వెటర్నరీ కళాశాల భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని ఏపీఈడబ్ల్యూఐసీడీ ఈఈ శివప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కళాశాల భవన నిర్మాణానికి పది ఎకరాలు సేకరించామని, త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ కుమార్, ప్రిన్సిపల్ యశిష్ట, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

16, 17న మురకంబట్టు జాతర

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని మురకంబట్టు గంగజాతరను మే16,17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మురకంబట్టులోని గంగమ్మ ఆలయం వద్ద సోమవారం జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. నిర్వహణపై చర్చించారు. 16న జాతరను ప్రారంభించి..మరుసటిరోజు నిమజ్జనం చేస్తామన్నారు. ఇందులో భాగంగా మే 9న ఎల్ల పూజలు చేయనున్నట్లు చెప్పారు.





ఆస్పత్రి కిటకిట!

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సోమవారం వివిధ వైద్యసేవలకు వచ్చిన ప్రజలతో కిటకిటలాడింది. ఓపీ కౌంటర్ వద్ద ప్రజలు, రోగులు భారీగా క్యూ కట్టారు. అత్యవసర విభాగం వద్ద జనం గుమిగూడారు. ప్రసూతి విభాగం ఆవరణ మొత్తం గర్భిణులు, చిన్న పిల్లల తల్లులు, మహిళలతో నిండిపోయింది. అలాగే జనరల్ వార్డులు కూడా ఇలాగే కనిపించాయి. వరుస సెలవుల కారణంగా ఆస్పత్రికి జనం తాకిడి అధికమైందని ఆస్పత్రి అధికారులు, వైద్యులు చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రముఖులు





కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ ప్లీడర్ రామనారాయణరెడ్డి, కలెక్టర్‌తో చర్చిస్తున్న ఇక్బాల్

చిత్తూరు కలెక్టరేట్: కలెక్టర్ షన్‌మోహన్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో ప్రభుత్వ ప్లీడర్ రామనారాయణరెడ్డి, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఇక్బాల్ చర్చించడమే కాకుండా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

వన్యప్రాణులకు వేటకు విద్యుత్ తీగలు అమర్చితే కేసులు

చిత్తూరు అర్బన్ / బంగారుపాళెం: వన్యప్రాణుల వేటకు పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు అమర్చితే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసమూర్తి, బంగారుపాళెం సీఐ నరసింహారెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో డీఎస్పీ, బంగారుపాళెంలో సీఐ సోమవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో కొంత మంది వేటగాళ్లు పొలాలలో అడవి పందులు, ఇతర వన్యప్రాణుల వేటకు అక్రమంగా విద్యుత్ తీగలను అమరుస్తున్నారన్నారు. ఈ కారణంగా రాత్రి సమయంలో పొలాలకు వెళ్లే రైతులు విద్యుత్ తీగలకు తగిలి బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పొలాల్లో విద్యుత్ తీగలు తగిలించిన వారిపై ప్రధానంగా రౌడీషీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే పొలాలకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా అక్రమంగా తీగలు లాగితే తమ దృష్టికి తేవాలని కోరారు.

ఫెడరేషన్ బలోపేతానికి కృషి

చిత్తూరు రూరల్: ఎస్సీ, ఎస్టీ నేషనల్ మైనారిటీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బలోపేతానికి కృషి చేయాలని ఆ సంస్థ అధ్యక్షుడు రాజమణి పాపయ్య అన్నారు. చిత్తూరులోని అంబేడ్కర్ భవనంలో సోమవారం ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. తొలుత దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, ఫెడరేషన్ పరంగా సేవా కార్యక్రమాలను చురుగ్గా చేయాలని, ఇందుకు జాతీయ కమిటీ తన వంతు సహకారం ఇస్తుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్బు, జిల్లా అధ్యక్షుడిగా పాండియన్, కార్యనిర్వహణ కార్యదర్శిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జస్టిన్, సభ్యలను ఎన్నుకున్నారు.

పెరుమాళ్లకండ్రిగలో 'ద్రౌపది కల్యాణం'



కల్యాణోత్సవంలో ద్రౌపదీ సమేత పంచపాండవుల మూర్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ద్రౌపదితో పాటు పంచపాండవుల మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, కల్యాణవేదికపై తీసుకొచ్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు చదివింపులు చేసి పసుపు కుంకుమ, గాజులు, ప్రసాదం తదితరాలను స్వీకరించారు. అనంతరం స్వామివార్లను గ్రామంలో ఊరేగించారు.

రాయితీపై మోటారుసైకిళ్ల పంపిణీ



వాహనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల విక్రేతలకు ఐస్‌బాక్సుతో కూడిన మోటార్‌సైకిళ్లను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతులమీదుగా ఆరుగురు లబ్ధిదారులకు బైక్‌లను అందజేశారు. రూ.75వేల విలువైన వాహనాలను బీసీలకు రూ.30వేలు, ఎస్టీలకు రూ.45వేల రాయితీతో అందించారు. ప్రభుత్వం చేయూతను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, గంగవరం, పెద్దపంజాణి కన్వీనర్లు మోహన్‌రెడ్డి, బాగారెడ్డి, ఎంపీపీ రెడ్డెప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్లు చాన్నాకమాల్, కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు మురళీకృష్ణ, చెంగారెడ్డి, రఘునాథ్, రహీంఖాన్, శ్యామ్, శ్యామ్ సుందర్‌రాజు, బాబు, రాజేష్,రమేష్ రెడ్డి, జమీలా ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పయణి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి కోనేటిరాయుని బ్రహ్మోత్సవాలు

గంగవరం: మండలంలోని కీలపట్లలో ఉన్న కోనేటిరాయస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర సోమవారం తెలిపారు. అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28నధ్వజారోహణం, శేషవాహన సేవ, 29న తిరుచ్చి ఉత్సవం, హంసవాహనసేవ, 30న సింహ వాహనసేవ, ముత్యపుపందిరి వాహనం, 1న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనసేవ, 2న మోహినీ ఉత్సవం, శ్రీవారి కల్యాణోత్సవం, గరుడసేవ, 3న హనుమంత వాహనం, వసంతోత్సవం, గజవాహనసేవ, 4న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 5న రథోత్సవం, అశ్వ వాహనసేవ, 6న తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణం, 7న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు.

ద్రవిడ వర్సిటీ మాజీ వీసీకి నివాళి



కుప్పం: ద్రవిడ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ రవ్వా శ్రీహరి చిత్రపటానికి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. వీసీ తుమ్మల రామకృష్ణ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి శ్రీహరి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి, రెక్టార్ అనురాధ పాల్గొన్నారు.